సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 28 । జూన్ । 2024



అన్నప్రసాద పథకానికి విరాళం

సింహాచలం: అప్పన్న శాశ్వత అన్నప్రసాద పథకానికి పీఎం పాలేనికి చెందిన బలిజి నాగేశ్వరరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి .

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.3/24.0

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

మామిడిపాలెం హైస్కూల్లో డీఈవో తనిఖీలు



పాఠశాలలో ప్రయోగశాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

తుమ్మపాల: విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచించారు. మండలంలోని మామిడిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదుల్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో సౌకర్యాల గురించి ఆరా తీశారు. టెన్త్ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని అభిలషించారు. రోజూ ఉదయాన్నే యోగాభ్యసన అలవాటు చేసుకోవాలన్నారు. పాఠశాలలో నిర్మాణం పూర్తయిన అదనపు తరగతి గదులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని హెచ్ఎంకు సూచించారు. పాఠశాల ప్రయోగశాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. 4వ తరగతి విద్యార్థులు ఆంగ్లంలో ప్రదర్శించిన రోల్ ప్లేను తిలకించి, విద్యార్థులను అభినందించారు. డీఈవో వెంట మానిటరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు బాబు, గొంది చిన బ్బాయ్, వసంతరావు, ఉమ తదితరులు న్నారు.

నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు



అమ్మవారి హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గత నెల 7వ తేదీ నుంచి ఈనెల 27వ తేదీ వరకు రూ. 50,01,327ల నగదు, 30 గ్రాముల బంగారం, కేజీ 200 గ్రాముల వెండి భక్తులు సమర్పించినట్టు ఈవో బండారు ప్రసాద్ చెప్పారు. ఈ నగదును గవరపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయశాఖ తనిఖీ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

91 మందికి ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్య

అనకాపల్లి: జిల్లాలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ఉచిత ప్రవేశాలకు మూడో విడతలో 91 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడో విడత ప్రవేశాలకు ఈ నెల 28(శుక్రవారం) వరకు గడువు ఉన్నందున విద్యార్థుల తల్లిదండ్రులకు తగు సూచనలిచ్చి, ప్రవేశాలు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని ఎంఈవోలను సూచించారు. తొలి రెండు జాబితాల్లో భర్తీకాని మిగులు సీట్లను మాత్రమే ఇప్పుడు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రైవాడలో గిరి నాగు హల్‌చల్





రైవాడలో గిరి నాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

దేవరాపల్లి: మండలంలోని రైవాడలో భారీ గిరి నాగు హల్‌చల్ చేసింది. రైవాడ ఎస్సీ కాలనీలోని ఓ పూరి గుడిసెలో గురువారం గిరి నాగు ప్రవేశించింది. సుమారు 12 అడుగుల పొడవుతో తాటాకుల మధ్య తిష్ట వేసింది. బుసలు కొడుతున్న చప్పుడు రావడంతో గుడిసెలో నివాసం ఉంటున్న వారు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. వెంటనే స్థానికులు ఫారెస్టు అధికార్ల ద్వారా స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు. ఆయన సుమారు గంట పాటు శ్రమించి గిరినాగును పట్టుకుని దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎడ్‌సెట్‌లో సత్తా చాటారు

- రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన చంద్రిక
- ఏపీ పీజీ సెట్‌లో వెంకటేష్‌కు 15వ ర్యాంక్

పాయకరావుపేట/కె.కోటపాడు/అనకాపల్లి: ఆంధ్రా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్-2024 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో సత్తా చాటారు. భౌతికశాస్త్రం(ఫిజిక్స్) మెథడాలజీలో జిల్లాలోని పాయకరావుపేటకు చెందిన కాశిన వీరసాయి చంద్రిక రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకుతో సత్తా చాటింది. కె.కోటపాడుకు చెందిన శీరా ఝాన్సి 9వ ర్యాంకు సాధించింది. అనకాపల్లి టౌన్ పెరుగుబజార్ జంక్షన్‌కు చెందిన గొంపిన ఎస్ఎస్ఎస్ శ్రావిక గణితంలో 4వ ర్యాంక్‌తో ప్రతిభ కనబరిచారు.

నాన్నబాటలో..

ఎడ్‌సెట్ ఫిజిక్స్ మెథడాలజీలో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. డిగ్రీ వరకు శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో చదివా. అనంతరం మద్రాసు ఐఐటీలో ఎమ్మెస్సీ చేశా. అమ్మ గృహిణి. మా నాన్న కాశిన వీరవెంకట సత్యనారాయణ నక్కపల్లి మండలం డొంకాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచీ ఆయనే నాకు ఆదర్శం. భవిష్యత్ తరాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలిగేది ఉపాధ్యాయులు మాత్రమే. అందుకే ఉపాధ్యాయ వృత్తిలో చేరి, ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆశ.

– కాశిన వీరసాయి చంద్రిక, ఫిజిక్స్ ఫస్ట్ ర్యాంకర్, పాయకరావుపేట టౌన్



ఫస్ట్ ర్యాంకర్ చంద్రికకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

లెక్చరర్ కావాలనే ఆశతో..



అమ్మానాన్న(చిన్నమ్మ, రామకృష్ణ)లు వ్యవసాయం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. ప్రాథమిక విద్య ప్రభుత్వ స్కూల్లోనే సాగింది. ఇంటర్ సీబీఎస్ఈలో ఎంపీసీ చదివా. డిగ్రీతోపాటు ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ అప్లయిడ్ కెమిస్ట్రీని ఏయూలో పూర్తి చేశా. ప్రస్తుతం పోటీ పరీక్షలు రాసే క్రమంలో ఎడ్‌సెట్‌కు హాజరయ్యా. ఫిజిక్స్‌లో 83 మార్కులతో 9వ ర్యాంక్ రావడం ఆనందంగా ఉంది. రాబోయే రోజుల్లో మరింతగా కష్టపడి కళాశాల అధ్యాపకురాలిగా స్థిరపడాలని నా ఆకాంక్ష.

– శీరా ఝాన్సీ, ఫిజిక్స్ 9వ ర్యాంక్, జోగన్నపాలెం, కె.కోటపాడు

భర్త ప్రోత్సాహంతో..



నా భర్త కాపుగంటి శ్రీకాంత్ ప్రోత్సాహంతో ఎడ్‌సెట్ రాశా. గణితంలో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఏయూలోనే 2016లో ఎమ్మెస్సీ(మ్యాథ్స్) పూర్తి చేశా. మళ్లీ రెండేళ్ల ఏయూలో బీఈడీ చదవనుండం చాలా సంతోషం అనిపిస్తోంది. ప్రస్తుతం పట్టణంలోని సాయికుల్వంత్ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌గా చేస్తున్నా. నా భర్త అచ్యుతాపురం లారస్ కంపెనీలో సీనియర్ కెమిస్ట్‌గా పనిచేస్తున్నారు. మాకు ఓ బాబు, పాప ఉన్నారు. ప్రభుత్వ టీచర్‌గా స్థిరపడాలని ఆశ.

– గొంపిన ఎస్ఎస్ఎస్ శ్రావిక, పెరుగుబజార్ జంక్షన్, అనకాపల్లి టౌన్

ఏపీ పీజీ సెట్‌లో మెరిసిన వెంకటేష్

రాంబిల్లి: ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో దిమిలి గ్రామానికి చెందిన పులిగా వెంకటేష్ ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో 15వ ర్యాంకు సాధించాడు. యలమంచిలి ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదువుకున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ర్యాంకు సాధించాలన్న తపనతో కష్టపడి చదివినట్లు వెంకటేష్ సాక్షికి తెలిపాడు. అనుకున్నట్లే మంచి ర్యాంకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశాడు. ఏయూలో ఎమ్మెస్సీ చేయాలన్న తన కోరిక నెరవేరుతోందన్నారు. వెంకటేష్‌ను తల్లిదండ్రులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.



15వ ర్యాంకు సాధించిన వెంకటేష్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

రేపు జాతీయ లోక్ అదాలత్

- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్పీ కె.వి.మురళీకృష్ణ



తుమ్మపాల: ఈనెల 29న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టులలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారన్నారు. రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులలో కోర్టు ఇచ్చిన నివేదిక, జిల్లా పరిధిలోని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల ప్రకారం రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులలో కక్షిదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఇరు పక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, జాతీయ లోక్‌అదాలత్ గురించి అవగాహన కల్పించి, వారి సమ్మతితో కేసుల పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నోటీసులు అందిన కక్షిదారులు వారి కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, డబ్బు ఆదా అవుతుందని, సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. అందరితో స్నేహపూర్వక సంబంధాలు ఉంటాయన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించామన్నారు.

చట్టాల పేర్లు మార్చడం సహేతుకం కాదు

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరావు



జిల్లా కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

విశాఖ లీగల్ : పోలీస్, న్యాయవ్యవస్థలను బలోపేతం చేయకుండా చట్టాల పేర్లు ఇంగ్లిష్ నుంచి హిందీలోకి మార్చడం సహేతుకం కాదని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయరావు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ప్రకాశరావుపేటలోని విశాఖ జిల్లా కోర్టు గేటు ఎదుట గురువారం న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ)లోని మూడు కీలకమైన క్రిమినల్ చట్టాలను కేంద్రం వివాదాస్పదంగా మారుస్తోందని విమర్శించారు. గతేడాది పార్లమెంటు సమావేశంలో ఈ మూడు కీలక చట్టాల్లో మార్పులు చేస్తూ చట్టాల పేర్లు కూడా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టి, చర్చ జరపకుండా రాష్ట్రపతి ఆమోదం చేయించి, ప్రస్తుతం అమల్లోకి తీసుకొస్తుందన్నారు. అనాదిగా ఇంగ్లిష్ పేర్లతో కొనసాగుతున్న ఈ చట్టాలు హిందీలో పేరు పెట్టడం వెనక సహేతుకమైన కారణం లేదని తెలిపారు. దీనివల్ల దేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో న్యాయవ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దేశంలో ఇటీవల హింసాత్మక నేరాలు, సైబర్ నేరాలు ,మాదకద్రవ్యాలకు సంబంధించి నేరాలు, మహిళలపై దాడులు కూడా పెరిగాయని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో నేరాల సంఖ్య తగ్గించే విధంగా పోలీస్ వ్యవస్థలను బలోపేతం చేసి సత్వర న్యాయం బాధితులకు జరిగేలా చూడాలని సూచించారు.

వీటి మీద దృష్టి పెట్టకుండా ప్రభుత్వం చట్టాలకు మార్పు తేవడం వల్ల గాని, పేర్లు మార్చడం వల్ల గాని ఎటువంటి ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. ఈ చట్టాల అమలును అఖిల భారత న్యాయవాదుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. నిరసనలో జిల్లా అధ్యక్షుడు అల్లు సురేష్ కుమార్, కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు 8లో

వర్షాల జోరు



పెద్దేరు జలాశయంలో ఒక గేటు ద్వారా నీరు విడుదల



మాడుగులలో పెద్దేరు రిజర్వాయర్ నీరు విడుదలతో బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో డైవర్షన్ రోడ్డు వద్ద ఉధృతి

- నిండుకుండలా 'పెద్దేరు'

మాడుగుల:: జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న ఈ వర్షాలకు తాండవ, పెద్దేరు, తాచేరు, బొడ్డేరు, శారద నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దేరు రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో గురువారం నీటిపారుదల శాఖ అధికారులు గేట్లు ఎత్తి కిందకు నీరు విడుదల చేశారు. దాంతో బుచ్చెయ్యపేట మండలం వడ్డాది డైవర్షన్ రోడ్డును ఆనుకుని వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లో, గోతుల్లో చేరిన వర్షం నీటిలో నుంచి రాకపోకలు సాగించడానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పొలాల్లో వర్షం నీరు చేరడంతో రైతులు వరి ఆకుపోతలకు సిద్ధమవుతున్నారు.

400 క్యూసెక్కుల పెద్దేరు నీరు దిగువకు విడుదల

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రావిపాలెం వద్ద గల పెద్దేరు జలాశయంలో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురవడంతోపాటు గురువారం అడపా దడపా కురిసిన వర్షానికి జలాశయంలో నీటిమట్టం 136.60 మీటర్లకు పెరిగింది. గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 250 క్యూసెక్కుల నీరు చేరుతోందని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. పెరిగిన నీటిమట్టాన్ని దృష్టిలో ఉంచుకొని, జలాశయం నుంచి ఒక గేటు ద్వారా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వర్షాలకు నీటిమట్టం పెరిగిందన్నారు. జలాశయం పరివాహక ప్రాంతాలైన జంపెన, వీరనారాయణం, వీరవల్లి అగ్రహారం, సత్యవరం, జి.అగ్రహారం, పోతనపూడి, తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఆయన సూచించారు. ఒంటరిగా పశువులను నదులలో అవతలి ఒడ్డుకు తోలుకెళ్లవద్దని సూచించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ, అధికార్లకు సమాచారం అందించామని జేఈ పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- జాగ్రత్తలు పాటించకుంటే సీజనల్ వ్యాధులు
- వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాల్సిన సమయమిది
- వైద్యుల సలహాలు, సూచనలు పాటించడం ఉత్తమం
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగ కారకాలు దూరం




సాక్షి, అనకాపల్లి: వర్షాకాలం ప్రారంభమైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం ఇదే. సరైన ఆరోగ్య జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడే ప్రమాదం ఎక్కువ. అందుకే ప్రతి ఒక్కరూ రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సరైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామానికి తోడు రోజువారీ పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

రోజువారీ ఆహారం

ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజ ధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులతో 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయ తింటే మేలు.

జలుబు నివారణకు..

ఈ కాలంలో ఎక్కువగా పీడించేవి జలుబు, దగ్గు, ఆయాసం. ఈ సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడి నీరు, పాలు, టీలో ఏదేని ఒకదానిలో కలిపి తాగితే ఉపశమనం లభిస్తుంది.



ఇవేవీ అందుబాటులో లేకపోతే ఒక గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజ ధాన్యాలు, ఆకుకూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి. సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాలతో చిరుతిండి, ఒక కప్పు పాలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా రెండు చపాతీలు లేదా పుల్కాలు కూరగాయలతో తినాలి. ఒకవేళ కూరగాయ, పెరుగు వద్దనుకుంటే 100 గ్రాముల మాంసాహారం తీసుకోవచ్చు.

వీటికి దూరంగా ఉండాల్సిందే..

నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోరాదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండటమే శ్రేయస్కరం.

నీరు.. పాలు

పరిశ్రుభమైన నీటినే తాగాలి. ఎత్తు, బరువుకు సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దరిచేరవు. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 ఎం.ఎల్. పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్న వారు రోజుకు ఒకటి రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోకపోవడమే శ్రేయస్కరం.

పప్పు ధాన్యాలు కీలకం

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజు ఏదో ఒక ఆకుకూర కనీసం 100 గ్రాములు తీసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని రోజూ ఆహారంలో భాగంగా చేసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తినాలి.

తాజా పండ్లు, కూరగాయలు మేలు

ప్రతిపూట భోజనానికి ముందు, తర్వాత తప్పని సరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం కొంచెంగా తీసుకోవాలి. ఆహారంలో తాజా ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. వీటిలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్నిరకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో కూడా తీసుకోవచ్చు.

మంచి ఆహారంతో ఆరోగ్యం

ఆహారం బాగా ఉడికించి తినాలి. ఏ, సీ, డీ, కే విటమిన్లు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు. అంధత్వంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, తట్టు, శ్వాసకోశ సంబంధ వ్యాధులను నివారించేందుకు ఏ విటమిన్ బాగా పని చేస్తుంది. తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, మునగాకు, మామిడి, బొప్పాయి, గుమ్మడి వంటివి తీసుకోవడం వల్ల శరీరానికి సరిపడా విటమిన్లు అందుతాయి. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ఇలా చేస్తే రోగకారకాలను నియంత్రించవచ్చు.

– బాలాజీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

అన్నదాత సుఖీభవ డబ్బులివ్వండి..

- తహసీల్దార్‌కు జిల్లా రైతు సంఘం వినతిపత్రం



చోడవరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా రైతు సంఘం ప్రతినిధులు

చోడవరం: అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు వెంటనే రైతులకు ఇవ్వాలని జిల్లా రైతు సంఘం డిమాండ్ చేసింది. తక్షణం ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి జమచేయాలని కోరుతూ చోడవరం తహసీల్దార్ వేణుగోపాలరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా నేటికీ ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ డబ్బులు రైతులకు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ధ్వజమెత్తారు. రైతులకు వ్యవసాయ పనులకు ఉపయోగపడేందుకు అందిస్తామన్న పెట్టుబడి డబ్బులు ఇప్పటి వరకూ ఇవ్వకపోతే రైతులు అప్పులు చేసుకొని మరలా పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సుఖీభవ పథకంలో ప్రతి రైతుకు రూ. 20వేలు ఇస్తానని హామీ ఇచ్చారని, ఆ డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లోకి జమచేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా విత్తనాలు, పురుగు మందులు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అన్నీ సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు 25 పైసలు వడ్డీకే రైతులకు ఇప్పించాలని కోరారు.రైతులకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న రిజర్వాయర్ల నుంచి విడుదలయ్యే నీరు దిగువ ఆయకట్టుకు చేరేలా పంట కాల్వలను పూడికలు తీయించాలన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిల్లి గణేష్, సబ్బవరపు గణేష్, బొబ్బిలి శంకరరావు, పూలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- డిప్యూటీ డీఈవో అప్పారావు



పుస్తకాల విక్రయ స్టోర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం : నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. గురువారం ఆయన శ్రీమేధస్వి, శ్రీవిద్యాంజలి పాఠశాలలను తనిఖీ చేశారు. అధిక ఫీజులు వసూలు చేసినట్టు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనల మేరకు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించరాదని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనెలు అతిక్రమిస్తే అటువంటి పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో సిహెచ్.తలుపులు, నోడల్ హెచ్‌ఎం కిట్టు ఉన్నారు.

రేపు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎం.పోలినాయుడు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జెడ్పీ చైర్ పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి , ఆరు, ఏడో స్థాయీ సంఘ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో సభ్యులందరూ హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు

తాటిచెట్లపాలెం(విశాఖ) : పుణ్యక్షేత్రాల సందర్శించాలనుకునే భక్తులు, పర్యాటక యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక విమాన ప్యాకేజీలను ప్రవేశపెడుతున్నట్టు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి సావర్కర్ తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల వారి కోసం విశాఖ నుంచే పలు జాతీయ, అంతర్జాతీయ ప్యాకేజీలను మొట్టమొదటిసారి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్యాకేజీలో ఎల్‌టీసీ, ఎల్‌ఎఫ్‌సీ వంటి సదుపాయాలు కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఈ ప్యాకేజీలు కాకుండా డైరెక్టుగా కస్టమర్స్‌కు కావలసిన ప్యాకేజీలను కూడా రూపొందిస్తున్నా మన్నారు. సమావేశంలో ఆమెతో పాటు ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటివ్ (భువనేశ్వర్) సంఘమిత్ర రౌల్, సిబ్బంది పాల్గొన్నారు.

టూర్‌ల వివరాలు

మేజికల్ థాయ్‌లాండ్: ఈ టూర్ విశాఖలో మొదలై, విశాఖలో ముగుస్తుంది. మొత్తం 5 రాత్రులు, ఆరు పగళ్లు. సెప్టెంబరు 7న మొదలై 12వ తేదీన ముగుస్తుంది. విశాఖ నుంచి ప్రత్యేకంగా పరిచయం చేస్తున్న మొదటి అంతర్జాతీయ టూర్. ఈ ప్యాకేజీలో పట్టాయలోని నాంగ్‌నూచ్ గార్డెన్, అల్కజర్ షో, కోరల్ ఐలాండ్, సఫారి వరల్డ్ టూర్, రాత్రి భోజనంతో కూడిన రివర్ క్రూయిజ్, బ్యాంకాక్‌లోని గోల్డెన్



టూర్స్ వివరాలను వెల్లడిస్తున్న క్రాంతి సావర్కర్

బుద్ధ, మార్బుల్ బుద్ధ, శ్రీ రాచ టైగర్ జూ వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు. భోజనం, అల్పాహారం, వసతి (4స్టార్ హోటల్), ఏసీ సైట్ సియింగ్, ఇన్సూరెన్స్‌తో కలిపి ఒకొక్కరికి రూ.57,815.

సదరన్ డివైన్ టెంపుల్ టూర్ : ఈ యాత్ర మొత్తం 5 రాత్రులు, ఆరు పగళ్లు ఉంటుంది. ఈ టూర్ ఆగస్టు 14వ తేదీన విశాఖలో ప్రారంభమై 19వ తేదీన విశాఖలో ముగుస్తుంది. దక్షిణాదిలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మధురైలోని మీనాక్షి అమ్మన్ గుడి, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, ధనుష్కోడి, కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్, త్రివేంద్రంలోని శ్రీపద్మనాభస్వామి ఆలయాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి విమాన టికెట్లు, లోకల్ సైట్ సీయింగ్, భోజనం, ఏసీ హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో కలిపి రూ.38,005 చార్జీ చేస్తారు.

భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర (విశాఖ నుంచి) : మానస్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో దేవ్‌భూమి ఉత్తరాంఖండ్ యాత్ర. ఇది విశాఖ నుంచి ప్రారంభిస్తున్న మొదటి యాత్ర. మొత్తం థర్డ్ ఏసీ కోచ్‌లతో కూడిన ప్రత్యేక రైలు విశాఖ నుంచి ప్రారంభమవు తుంది. మొత్తం 11రాత్రులు, 12 పగళ్లు ఉంటుంది. ఈ టూర్ జూలై 26న విశాఖలో ప్రారంభమై ఆగస్టు 8వ తేదీన విశాఖలో ముగుస్తుంది. ఈ టూర్‌లో భీమ్‌టాల్ నైనిటాల్, కైంచి ధామ్, కసర్‌దేవి, కతర్‌మల్ సన్ టెంపుల్, జగదీశ్వర్ ధామ్, గోలు దేవతా, అల్‌మోరా, బైజనాథ్, బాఘేశ్వర్, కౌసని, రాణికేత్ వంటి ప్రాంతాలను సందర్శించవచ్చు. ఒకొక్కరికి రైలు థర్డ్ ఏసీ, హోటల్ వసతి, నాన్ ఏసీ, ఏసీ వాహనాల్లో సైట్ సీయింగ్, భోజనం, టిఫిన్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో కలిపి స్టాండర్డ్ అయితే రూ.28,020, డీలక్స్ అయితే రూ.35,340 ఉంటుంది.

మరిన్ని వివరాలకు విశాఖ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్రవేశద్వారం వద్ద గల ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో స్వయంగా గానీ లేదా చందన్‌కుమార్-92810 30748, సాయిప్రసాద్ - 92814 95847, కేవీ రావు - 95501 66168 నంబర్లలో సంప్రదించాలని ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు కోరారు.

త్రిశంకు స్వర్గంలో..

- విమల విద్యాలయం భవిష్యత్
- తరగతి గదుల్లో విద్యార్థులు, ఆందోళన బాటలో టీచర్లు
- ఉక్కు యాజమాన్యం నిర్ణయంపై ఎదురుచూపులు



ఉక్కు విమల విద్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం (విశాఖ):

స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) విద్యార్థుల పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది. పాఠశాలకు వస్తున్నారు గానీ తరగతులు జరగడం లేదు. ఉపాధ్యాయులు పాఠశాల బయట ఆందోళన కొనసాగిస్తున్నారు. పాఠశాల నిర్వహణపై ఉక్కు యాజమాన్యం నుంచి నిర్ణయం వచ్చే వరకు ఇలానే పరిస్థితి కొనసాగనుంది.

సుమారు 40 ఏళ్ల కిందట నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు, బలహీన వర్గాల కోసం ఉక్కునగరంలో విశాఖ విమల విద్యాలయంను నాటి యాజమాన్యం ఏర్పాటు చేసింది. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సాయంతో నగరానికి చెందిన ఆర్‌సీఎం డైయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల నడుస్తోంది. ఇందులో శాశ్వత ఉపాధ్యాయులు 30 మంది, నాన్ టీచింగ్ స్టాఫ్ 10 మందితో పాటు అవుట్ సోర్సింగ్‌తో కలిపి మొత్తం 70 మంది విధులు నిర్వహిస్తున్నారు. శాశ్వత ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు అందిస్తున్నారు. సుమారు 2 వేల మంది విద్యార్థులు ఉన్న పాఠశాల నిర్వహణకు ఉక్కు యాజమాన్యం ఏటా రూ. 6కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ప్రతీ ఐదేళ్లకు ఓసారి ఉక్కు యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం మధ్య జరిగే ఎంవోయూ మేరకు పాఠశాల నిర్వహణ కొనసాగుతోంది. ఈ ఎంవోయూ ఈ ఏడాది మే 31తో ముగిసింది. ప్రస్తుత స్టీల్‌ప్లాంట్ గడ్డు పరిస్థితుల నేపథ్యంలో ఉక్కు యాజమాన్యం బిల్డింగ్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ఆర్థిక వనరులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించింది. ఈ మేరకు కొత్త ఎంవోయూ చేసుకునేందుకు సన్నద్ధమైంది. పాత పద్ధతిలో మాత్రమే వేతనాలు చెల్లించగలమని, ఫీజుల పెంపు వంటి వాటి ద్వారా తాము కొనసాగించలేమని పాఠశాల యాజమాన్యం చేతులెత్తేసింది. దీంతో జూన్ 13న పాఠశాలను మూసి వేశారు.

ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను తరగతులకు అనుమతించినప్పటికీ.. ఎంవోయూ జరిగే వరకు తరగతులకు హాజరుకావద్దని ఉపాధ్యాయులకు ఆదేశించింది. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లో కాలక్షేపం చేస్తుండగా.. ఉపాధ్యాయులు 15 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు అవుట్ సోర్సింగ్ సిబ్బందితో మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. కాగా.. ఉపాధ్యాయుల ఆందోళనకు వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు మద్దతు ఇస్తున్నారు.

ఉక్కు యాజమాన్యం నిర్ణయం పైనే..

ఈ అంశంపై వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు ఉక్కు యాజమాన్యంతో ఓ దఫా చర్చలు జరిపారు. ఈ సమావేశంలో యాజమాన్యం తాజా పరిస్థితిని వివరించింది. కాగా.. ఉపాధ్యాయులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌ను కలిసి తమ గోడును విన్నవించారు. ఆయన ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి.. సీఎండీకి లేఖ పంపారని ఉపాధ్యాయులు తెలిపారు. ఉక్కు యాజమాన్యం నిర్ణయం కోసం అటు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉక్కు యాజమాన్యం తీసుకునే నిర్ణయంపైనే విమల విద్యాలయం భవిష్యత్ ఆధారపడి ఉన్నదనడంలో ఎటువంటి సందేహం లేదు.

చెరకులో పేనుబంక ఉధృతికి అవకాశం

- అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు చెరకులో పసుపు ఆకు తెగులను వ్యాప్తి చేసే పేనుబంక పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. దీని నివారణకు డైమిథోయేట్ 2 మీ.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో పలు సూచనలు, సలహాలు అందించారు. 120 రోజుల వయసు గల చెరకు పైరులో మొక్కల వరుసల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని, పంట ఎదుగుదలను బట్టి మువ్వులో 8 ఆకులు వదిలి జడ చుట్టు వేసుకుంటే గాలులకు తోట పడిపోకుండా ఉంటుందన్నారు. వర్షాధార చెరకు నాటే సమయంలో ముచ్చెలను 10 శాతం సున్నపు నీటిలో ఒక గంట సేపు ఉంచి నాటుకోవాలని సూచించారు. ఎకరాకు 1.25 టన్నుల చొప్పున నాటిన మూడో రోజున చెరకు చెత్త కప్పాలన్నారు. ఖరీఫ్‌లో మొక్కజొన్న పైరును వేసుకునే రైతులు, రాగల ఐదు రోజుల్లో వర్ష సూచన ఉన్నందున, నేలను దున్ని తయారు చేసుకుని అధిక దిగుబడి వచ్చే డీహెచ్‌ఎం-117, 119, 121 వంటి రకాలను, ఎకరాకు 8 కిలోల చొప్పున విత్తుకోవాలని సూచించారు. చోడి(రాగి) వేసుకునే రైతులు వర్షాలను వినియోగించుకుని ఇంద్రావతి, వేగావతి, శ్రీచైతన్య వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎకరాకి 25 కిలోల విత్తనం ఐదు సెంట్ల నారుమడిలో రాగి విత్తు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు పీవీకే జగన్నాథరావు, ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు విశాలాక్షి, ఉమామహేశ్వరరావు, వి.గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి కేకే లైన్ డబ్లింగ్ పనుల పూర్తి



టన్నెల్ వద్ద బ్లాస్టింగ్ (పేలుడు) పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్

తాటిచెట్లపాలెం (విశాఖ): కేకే లైన్‌లో 100 కిలో మీటర్లు మేర డబ్లింగ్ పనులు ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కేకే లైన్‌లో జరుగుతున్న రెండో లైన్ పనులను కొత్తవలస-అరకు స్టేషన్‌ల మధ్య ఆయన పరిశీలించారు. గురువారం ఫేస్ బ్లాస్టింగ్ ద్వారా బొడ్డవర - శివలింగపురం మధ్య గల 5వ నంబర్ గుహ వద్ద సుమారు 1.4 కిలోమీటర్లు పొడవైన గుహను తొలగించడం ఓ మైలురాయి అని తెలిపారు. ఈ మార్గంలో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, కష్టతరమైన బొడ్డవర-శివలింగపురం మార్గంలో గల 6 టన్నెల్స్‌లో 4 టన్నెల్స్ నిర్మాణం చేపట్టి, ఇప్పటికే పూర్తిచేసినట్లు తెలిపారు. మార్చి 2026 కల్లా ఈ లైన్ పూర్తి చేసే దిశగా పనులు పూర్తి చేస్తున్నట్లు డీఆర్ఎం తెఇపారు. 189 కిలోమీటర్లు పొడవైన కోరాపుట్-కొత్తవలస సెక్షన్‌లో ఇప్పటి వరకు 96.45కిలోమీటర్ల మేర రెండో లైన్ పనులు పూర్తిచేసినట్లు, ఆగస్టు 15వ తేదీకి 100కిలో మీటర్లు పూర్తి కావస్తుందని తెలిపారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజీవ్‌కుమార్, వాల్తేర్ డివిజన్ ఇతర ఉన్నతాదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టోల్ బూత్‌ల తొలగింపు

టోల్‌ప్లాజా వసూళ్ల నిలుపుదల



బూత్‌ల తొలగింపు అనంతరం టోల్‌ప్లాజా

అగనంపూడి (విశాఖ): దశాబ్ద కాలం పాటు వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన అగనంపూడి టోల్‌ప్లాజా ఫీజుల వసూళ్లకు ఫుల్‌స్టాప్ పడింది. స్థానిక నేతలు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నాలుగు టోల్‌బూత్‌లను పొక్లెయిన్‌తో తొలగించారు. సుమారు 12 ఏళ్ల నుంచి అగనంపూడి టోల్‌ప్లాజాను తొలగించాలని స్థానికులు ఆందోళనలు చేస్తున్నారు. 2019లో హైకోర్టు ఆదేశాలతో టోల్‌ఫీజు వసూళ్లకు ఫుల్‌స్టాప్ పడింది. అయితే కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై సుప్రీం కోర్టులో కేసు వేయడం, స్టే తెచ్చుకుని మళ్లీ యథావిధిగా టోల్‌ప్లాజాను కొనసాగించారు. అనకాపల్లి వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేసిన తర్వాత ఇక్కడి టోల్‌ప్లాజాను తొలగిస్తామని అప్పట్లో సుప్రీం కోర్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అయితే అనకాపల్లి సబ్బవరం మధ్యలో టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసిన తర్వాత కూడా ఇక్కడ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక నాయకులు టోల్‌ప్లాజాను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న టోల్‌ప్లాజాను తొలగిస్తామని రెండు రోజుల కిందట ఆందోళనకు దిగిన నాయకులు.. బుధవారం అర్ధరాత్రి తర్వాత టోల్ బూత్‌లను దగ్గరుండి తొలగింపజేశారు. బూత్‌ల్లో ఉన్న కంప్యూటర్లను సిబ్బంది జాగ్రత్త పరిచిన తర్వాత.. బూత్‌లను నేటమట్టం చేశారు. బూత్‌ల వద్ద ఉన్న ఇనుప గేట్లను కూడా తొలగించారు. ఇదిలా ఉంటే కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా దౌర్జన్యంగా తొలగింపు చర్యలు చేపట్టడం చట్ట విరుద్ధమని హైవే అథారిటీ అధికారులు చెబుతున్నారు. తొలగించిన విషయాన్ని ప్రాజెక్టు అధికారులకు తెలియజేశామని.. తదుపరి అధికారుల నిర్ణయం మేరకు వ్యవహరిస్తామని ఇక్కడి అధికారులు తెలిపారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై దాడి

- రూ.14వేలు నగదు, సెల్‌ఫోన్‌తో పరార్
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

నాతవరం : బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి సెల్‌ఫోన్, నగదు ఎత్తుకుపోవడంతో బాధితుడు నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలివీ. నాతవరం మండలం మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెం గ్రామానికి చెందిన పోలుపర్తి రమేష్‌నాయుడు నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లిలో మెడికల్ ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. ఎప్పుడు మాదిరిగానే నర్సీపట్నంలో ల్యాబ్‌లో పని ముగించుకుని బుధవారం సాయంత్రం 7గంటల సమయంలో బైక్‌పై వెన్నలపాలెం తన ఇంటికి బయలుదేరి వస్తున్నాడు. నర్సీపట్నం నుంచి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో నాతవరం మండలం ములగపూడి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వేగంగా అడ్డుగా వచ్చి బైక్ ఆపారు. ఈ ప్రాంతంలో జామకాయలు ఎక్కడ అమ్ముతారని రమేష్‌నాయుడును అడిగారు. ముందు తాండవ జంక్షన్‌లో జామికాయులు అమ్ముతారని రమేష్‌నాయుడు సమాధానం చెబుతుండగా ఒకరు బైక్‌పై రన్నింగ్‌లో ఉండగా ఇద్దరు వ్యక్తులు బైక్ దిగి రమేష్‌నాయుడు జేబులో ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ.14వేలు నగదు లాక్కొని బైక్‌పై కోటనందూరు వైపు పరారయ్యారు. దీంతో బాధితుడు నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నాతవరం : మండలంలో చమ్మచింత పంచాయతీ శివారు పొట్టినాగన్నదొరపాలెం గ్రామానికి చెందిన వెలకాడ కొండబాబు (39) బైక్ ఢీకొని మృతి చెందినట్టు నాతవరం ఎస్‌ఐ రామారావు తెలిపారు. మృతుడు సత్తిబాబు బుధవారం రాత్రి వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కొయ్యూరు మండలం రొంగలి కొత్తూరు గ్రామానికి చెందిన మాకిరెడ్డి శ్రీనివాస్ బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సత్తిబాబుకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టుగా ఎస్‌ఐ రామారావు గురువారం తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మాకవరపాలెం : రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు వెనుక ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. విశాఖ వైపు నుంచి నర్సీపట్నం వస్తున్న కారు బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు వద్దకు వచ్చేసరికి వర్షం కారణంగా రోడ్డు మధ్యలో గల డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. డివైడర్లకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతోనే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం



సుస్మిత, కౌశిక్, ప్రణీత్ (ఫైల్)

గోపాలపట్నం: ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యమైంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ..మాధవధార సీతన్నగారైన్ కళింగనగర్‌లో మీసాల వెంకటనాయుడు వద్దే అతని కుమార్తె వై.సుస్మిత ఉంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు కౌశిక్ నాయుడు, ప్రణీత్ ఉన్నారు. ఈ నెల 25న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధువుల ఇంట్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తండ్రి ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిల్లలను ఇంటికి తీసుకురాకుండానే..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొన్న బైకర్



వెంకటరమణ(ఫైల్)

కొమ్మాది (విశాఖ): ట్యూషన్‌కు వెళ్లిన తమ పిల్లలను తీసుకొచ్చేందుకు వెళ్లిన ఓ తండ్రి రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. దీంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. బీచ్‌రోడ్డులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి గొల్లలపాలెంలో చందక వెంకటరమణ(42) తన భార్య రమాదేవి, కుమారుడు మహిధర్, కుమార్తె దీక్షితతో కలసి నివాసం ఉంటున్నారు. వెంకటరమణ లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు పిల్లలు భీమిలిలో ప్రతిరోజూ ట్యూషన్‌కు వెళ్తుంటారు. యథావిధిగా బుధవారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లిన పిల్లలను తిరిగి ఇంటికి తీసుకొచ్చేందుకు వెంకటరమణ బైక్‌పై బయలుదేరారు. ఉప్పాడ జంక్షన్ వద్దకు వచ్చే సరికి ఎదురుగా కోలా ప్రశంగి అనే వ్యక్తి బైక్‌పై రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి.. వెంకటరమణ వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ క్రమంలో వెంకటరమణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనువెంటనే ఆయన్ని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు మృతి చెందాడు. అందరితోనూ సరదాగా ఉంటూ.. అందరికీ సహాయం చేసే వెంకటరమణ అకాల మరణాన్ని కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, ఆయన స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. వెంకటరమణ మృతితో గొల్లలపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. అతని భార్య రమాదేవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.రమేష్ తెలిపారు.

పెంపుడు కుక్కలతోనూ జాగ్రత్త!

- వాటి ప్రవర్తనపై కన్నేసి ఉంచాలి
- ఏటా వ్యాక్సినేషన్ తప్పనిసరి
- కాటేస్తే తక్షణమే రేబిస్ టీకా
- అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమే..
- భీమిలిలో కుక్క కాటుకు బలైన యువకుడు
- పెంపకందార్లను హెచ్చరిస్తున్న పశువైద్యులు



సాక్షి, విశాఖపట్నం: పెంపుడు కుక్కలంటే కడుపున పుట్టిన పిల్లల మాదిరిగానే చూసుకుంటారు. వాటిపై ఎనలేని ప్రేమాభిమానాలను చాటుకుంటారు. కొందరు ప్రాణంతో సమానంగా, అవే సర్వస్వంగా భావిస్తారు. మరికొందరు కుటుంబంలో ఒకరిగా మెలిగే పెంపుడు శునకాలతో మమేకమవుతూ జీవిస్తారు. అలాంటి కుక్కలు ఒక్కోసారి ప్రేమతోనో, కోపంతోనో కాటేస్తుంటాయి. అలాంటప్పుడు తక్షణమే రేబిస్ ఇంజక్షన్లు వేయించుకుంటే సరే. ఏమీ కాదులే అని నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. తాజాగా భీమిలిలో పెంపుడు కుక్క కాటుకు ఓ యువకుడు బలైన నేపథ్యంలో పెంపుడు కుక్కల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎంత అప్రమత్తంగా ఉండాలి? అన్న అంశం చర్చనీయాంశమైంది.

భీమిలికి చెందిన ఆర్టీసీ కండక్టరుగా పనిచేసిన నర్సింగరావు ఇంట్లో కొన్నాళ్లుగా కుక్కను పెంచుకుంటున్నారు. ఆ శునకం నర్సింగరావు 27 ఏళ్ల కుమారుడు భార్గవ్‌ను కొద్దిరోజుల క్రితం ముక్కుపై కరిచింది. అయితే దానిని తేలిగ్గా తీసుకున్న భార్గవ్‌సకాలంలో చికిత్స చేయించుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. దీంతో రేబిస్ వ్యాధి సోకడంతో పరిస్థితి విషమించి చనిపోయాడు. అప్పటికే పక్షవాతంతో బాధపడుతున్న తండ్రి నర్సింగరావు కూడా షాక్‌కు గురై మరణించాడు. ఇలా ఆ ఇంట పెంపుడు శునకం పెను విషాదాన్ని నింపింది. ఈ ఘటన నేపథ్యంలో పెంపుడు కుక్కల పట్ల కుటుంబ సభ్యులు వ్యవహరించాల్సిన తీరును పశు వైద్యులు సూచిస్తున్నారు.

సాధారణంగా చాలామందిలో వీధి కుక్క కరిస్తేనే రేబిస్ వ్యాధి సోకుతుందన్న భావన ఉంటుంది. అయితే వీధి కుక్కలే కాదు.. పెంపుడు కుక్కలు కరిచినా రేబిస్ వ్యాధి సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలా ఏ కుక్క కరిచినా వెంటనే వైద్యుని వద్దకు వెళ్లి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) వేయించుకోవాలి. లేనిపక్షంలో కరిచిన శరీర భాగాన్ని బట్టి తలపై కరిస్తే మెదడు దెబ్బతిని పక్షవాతం సోకుతుంది. నాలుక, గొంతు పనిచేయకుండా, ఆహారం తినే అవకాశం లేకుండా పోతుంది. నీరును చూసినా భయపడే పరిస్థితి వస్తుంది. చివరకు చికిత్సకు లొంగకుండా ప్రాణాంతకమవుతుంది. కరిచింది మన ఇంట్లో కుక్కే కదా? ఏమీ కాదులే అన్న భావనను వీడి తక్షణమే చికిత్స చేయించుకోవాలని పశు వైద్యులు పేర్కొంటున్నారు. పెంపుడు కుక్కలను వీధి కుక్కలతో కలవకుండా యజమానులు జాగ్రత్త తీసుకోవాలని సూచిస్తున్నారు.

రేబిస్ సోకిన కుక్క లక్షణాలిలా..

కరచిన (పెంపుడు/వీధి) కుక్క లక్షణాలను 14 రోజుల పాటు పరిశీలించాలి. ఈ రేబిస్ వ్యాధి సోకిన పెంపుడు కుక్క ఇంట్లో వారి మాట వినదు. ఆహారం సరిగా తీసుకోదు. చిన్న చిన్న వస్తువులను, కుటుంబ సభ్యులను సైతం కరుస్తుంటుంది. తరచూ నోటి నుంచి సొంగ కారుస్తుంటుంది. ఇలాంటి లక్షణాలున్న కుక్కలను ఆస్పత్రికి తీసుకెళ్లి తగిన చికిత్స అందించాలి. లేనిపక్షంలో రేబిస్ వ్యాధి సోకిన కుక్క 14 రోజుల్లోనే చనిపోతుంది.

యాంటీ రేబిస్ వాక్సిన్లు పుష్కలం

జిల్లాలో సుమారు ఎనిమిది వేలకు పైగా పెంపుడు కుక్కలున్నాయి. వీటిలో మూడు వేలు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఐదు వేల వరకు శునకాలు నగర పరిధిలోనూ ఉన్నాయి. వీటికి ఏడాది ఒకసారి వ్యాక్సిన్లు వేయించడం తప్పనిసరని పశు వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు (ఏఆర్‌వీలు) పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. ఏ కుక్క కాటేసినా అశ్రద్ధ చేయకుండా తక్షణమే చికిత్స చేయించుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకోవాలని సూచించారు. జులై 6న ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్కల పట్ల ఎలా వ్యవహరించాలి? కుక్కలకు రేబిస్ వ్యాధి సోకడం, ఏటా వ్యాక్సిన్లు వేయించుకోవలసిన ఆవశ్యకతలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

6 నుంచి వారాహి నవరాత్రులు

అనకాపల్లి: మండలంలోని బట్లపూడి పంచాయతీ పరిధి నాయుడుపేట సోహం ఆశ్రమంలో జూలై 6 నుంచి 15 వరకు వారాహి అమ్మవారి నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆశ్రమం వ్యవస్థాపకులు కాంద్రేగుల రవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6న ఆది వారాహి, 7న దండిని వారాహి, 8న బృహద్ వారాహి, 9న ఉన్మత్త వారాహి, 10న స్వప్న వారాహి, 11న ధూమ్ర వారాహి, 12న వజ్ర వారాహి, 13న శ్వేత వారాహి, 14న కిరాత వారాహి, 15న మహా వారాహి అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులకు అన్నసమారాధన ఉంటుందన్నారు.

సినిమా టికెట్ల ధరల పెంపు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

అనకాపల్లి: భారీ బడ్జెట్ పేరిట సినిమా ధరల్ని విపరీతంగా పెంచడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ ఆక్షేపించారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సినిమా టికెట్స్ అడ్డగోలు పెంపు లేదని, ప్రస్తుత ప్రభుత్వం సామాన్యులు దోపిడీకి గురయ్యేలా ఇష్టారీతిన టికెట్ ధరల పెంపునకు అనుమతివ్వడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం తాజాగా పెంచిన కల్కి సినిమా ధరల్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అల్లు రాజు, పి.చలపతి పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత వారం కంటే కిలోకి రూ.20 మేర తగ్గింది. గత వారం కిలో రూ.80 ఉండగా, ఈ వారం కిలో రూ.60కి విక్రయాలు సాగాయి. ఇక ఎప్పటిలాగే ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, దొండకాయలు. బెండకాయలు, వంకాయలు రూ.40, బీట్రూట్, క్యారెట్, చేమదుంప రూ.60, కాకరకాయ రూ.80, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
కల్కి2898 ఏడీ	:వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 50 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,970	5,240
రెండో రకం	4,240	4,240
మూడోరకం	3,250	3,860

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 281 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 236 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

బయ్యవరం కూడలిలో సౌర వెలుగులు

బయ్యవరం.. సుమారు పది గ్రామాల రాకపోకలకు ప్రధాన కూడలి. చీకటి పడిందంటే హైవేపై వేగంగా వచ్చే వాహనాలతో రోడ్డు దాటేందుకు భయపడే పరిస్థితి. ప్రయాణికుల కోసం నిరీక్షించే ఆటోవాలాల అవస్థలు అన్నీఇన్నీ కావు. ఏళ్ల తరబడి ఇక్కడ విద్యుత్ లైట్లు బిగించాలన్న స్థానికుల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. రూ.24 లక్షలతో సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రుళ్లు హైవే దాటేందుకు భయపడాల్సిన అగత్యం తప్పింది.



బయ్యవరం కూడలిలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ లైట్లు



వెలుగులు చిందిస్తున్న సోలార్ దీపాలు

- రూ.24 లక్షలతో సోలార్ లైట్ల ఏర్పాటు
- చీకటిలో కూడలి దాటే భయం తీరింది
- ఆనందంలో స్థానికులు, వాహనదారులు

కశింకోట: మండలంలోని బయ్యవరం, పరిసర గ్రామాల ప్రజల ఇక్కట్లు తీరాయి. జాతీయ రహదారిలో సోలార్ దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి. భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో రాత్రుళ్లు చీకట్లను పారద్రోలి వెలుగులు అందిస్తుండటంతో స్థానికులు, వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీకట్లో రోడ్డు దాటాలంటే భయం

కశింకోట-తాళ్లపాలెం మధ్య జాతీయ రహదారిని ఆనుకుని బయ్యవరం గ్రామం ఉంది. ఇది మండలంలోని మేజర్ పంచాయతీలైన కశింకోట, తాళ్లపాలెం తర్వాత అతి పెద్ద గ్రామం. ఇక్కడ సుమారు 3,500 మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామాన్ని ఆనుకుని జాతీయ రహదారి వెళుతోంది. బయ్యవరం చాలా గ్రామాలకు ప్రధాన కూడలి. బయ్యవరంతోపాటు చుట్టు పక్కల ఉన్న విసన్నపేట, తేగాడ, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, జోగారావుపేట తదితర గ్రామాల ప్రజలు, వాహన చోదకులు నిత్యం కూడలిని దాటుతుంటారు. అయితే కూడలిలో చీకటి పడిందంటే వెలుగు లేక హైవేని దాటి రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. వేగంగా వచ్చే వాహనాలతో, చీకట్లో వాటి లైటింగ్ ఆధారంగా సరిగా అంచనా వేయలేక పలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు, గాయపడ్డవారు ఎందరో ఉన్నారు. చీకటి పడిందంటే బిక్కు బిక్కు మంటూ రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఆ ఇక్కట్లు తీరాయి.

రూ.24 లక్షలతో సౌర వెలుగులు

స్థానికుల కోరిక మేరకు హైవేపై బయ్యవరం వద్ద రాత్రిపూట వెలుగు కోసం 20 రోజుల క్రితం సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఒక్కో స్తంభం, సోలార్ ప్యానెల్, లైట్ ఏర్పాటుకు రూ.1.20 లక్షల వంతున వెచ్చించి, రోడ్డుకు ఇరు వైపులా చెరో పది వంతున లైట్లను ఏర్పాటు చేసింది. ఇందుకు రూ.24 లక్షలు వెచ్చించింది. ఇవి వెంటనే వినియోగంలోకి రావడంతో రాత్రి పూట విద్యుత్ వెలుగులు జిగేల్‌మంటున్నాయి. పగటి పూట సూర్యకాంతితో రీచార్జ్ అయ్యి, సాయంత్రం 6.30 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు వాటంతట అవే వెలిగేలా సాంకేతికతను వినియోగించారు. దీంతో దూరం నుంచి వేగంగా వచ్చే వాహనాలు కూడలి వద్ద సంచారానికి అనువుగా తమ వేగాన్ని నియంత్రించుకునే వెసులుబాటు కలిగింది. ఇప్పుడు ప్రమాద భయాన్ని వీడి కూడళ్ల వద్ద హైవే దాటడం సులభమయిందని స్థానికులు, వాహనదారులు చెప్తున్నారు.

ఆటో నిలపాలంటే భయమేసేది



గతంలో హైవేపై చీకటిలో రోడ్డు దాటాలంటే భయంగా ఉండేది. కూడలి వద్ద ఇప్పుడు సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతో ఆ భయం తొలగింది. సాయంత్రం అయితే కూడలిలోఆటోను నిలిపి ప్రయాణికుల కోసం ఎదురుచూసే సమయంలో మా ఆటో కనపడక ఏ వాహనం ఢీకొంటుందోననే భయం పీడించేది. సోలార్ లైట్ల ఏర్పాటుతో చీకటి పడితే ఆటోమేటిగ్గా అవి వెలుగుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

–మోటూరి చిరంజీవి, ఆటో డ్రైవర్, బయ్యవరం

సోలార్ లైట్ల ఏర్పాటుతో ఆనందంగా ఉంది



బయ్యవరం కూడలిలో జాతీయ రహదారిపై సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది. గతంలో లైట్లు లేక చీకటి పడిందంటే కూడలిలో రోడ్డు దాటడానికి, కూడలిలో నిల్చోవటానికి చాలా ఇబ్బంది పడేవాళ్లం. వాహనాల రాకపోకలు సరిగా కానక ఏ క్షణాన ఎటువంటి ప్రమాదానికి గురి కావాల్సి ఉంటుందోనని భయపడుతూ రోడ్డు దాటాల్సి వచ్చేది. ఇప్పుడు లైటింగ్ వల్ల ఆ భయం దూరమైంది.

–జనపురెడ్డి పరమేశ్వరరావు, బయ్యవరం

8న వైఎస్సార్ జయంతి వేడుకలు



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: దివంగత మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను జూలై 8న గ్రామ స్థాయి నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జయంతి వేడుకల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనేలా క్షేత్రస్థాయిలో సన్నాహాలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట మండల పార్టీ అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, పార్టీ నాయకులు జాజుల రమేష్, బొడ్డేడ లక్ష్మీనారాయణ, కె.ఎం.నాయుడు, మూనూరు శ్రీనివాసరావు, గైపూర్ రాజు, భీశెట్టి జగన్, బుద్ధ రాజు, దాడి కుమార్, ఏడువాకల నారాయణరావు, బొండా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంబరాల్లో ప్రభాస్ ఫ్యాన్స్



కేక్ కట్ చేస్తున్న ప్రభాస్ ఫ్యాన్స్

తుమ్మపాల: పాన్ ఇండియా హీరో ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా గురువారం విడుదలై మంచి టాక్ సాధించడంతో పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు జీవీఎల్ఎస్ రాజు, ఆళ్ల ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో రామచంద్ర థియేటర్ వద్ద సంబరాలు జరిపారు. అభిమానుల కేరింతల నడుమ అట్టహాసంగా విజయోత్సవ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాభారతంలో అశ్వత్థామ పాత్ర ఆధారంగా తెలుగు సినిమా స్థాయిని పెంచేలా ఈ సైన్స్ ఫిక్షన్ సినిమాను హాలీవుడ్ రేంజ్‌లో తీశారని కొనియాడారు. వేడుకల్లో వందలాది మంది ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవార్ల పండగలు



మరిడిమాంబ ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు



చౌడువాడలో మల్లిలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: మండలంలోని నాలుగు గ్రామాల్లో గురువారం గ్రామదేవతల పండగలను ఘనంగా నిర్వహించారు. గుల్లేపల్లిలో మరిడిమాంబ, చౌడువాడలో మల్లిలమ్మ, ఆర్.వై.అగ్రహారం, యడ్లవానిపాలెం గ్రామాల్లో బంగారమ్మ అమ్మవార్ల పండగలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సంప్రదాయబద్ధంగా ఈ పండగలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బంధువులు, స్నేహితుల రాకతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. నాలుగు గ్రామాల్లో ఉదయం నుంచే అమ్మవార్లకు పూజలు చేసేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యార్థులకు డైరీల అందజేత



డైరీలు ఆవిష్కరిస్తున్న ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, హెచ్ఎం ప్రసాదరావు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాసవీ క్లబ్ వీ216ఏ ప్రతినిధులు పి.ఎస్.వరహాలరావు, వై.నర్సింగరావు, ఎస్.శ్రీనులు స్కూల్ డైరీలు పంపిణీ చేశారు. వీటిని గురువారం పాఠశాల సందర్శనకు వచ్చిన డిప్యూటీ డీఈవో అప్పారావుతో హెచ్ఎం ప్రసాదరావు తొలుత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డైరీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ డైరీలను సమర్థవంతంగా వినియోగించాలన్నారు. వీటి ద్వారా ప్రైవేట్ స్కూళ్ల మాదిరే సర్కారీ స్కూళ్ల విద్యార్థుల ప్రగతిని వారి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. డైరీని రూపొందించి, విద్యార్థులకు అందించిన దాతలను హెచ్ఎం అభినందించారు. ఉపాధ్యాయులు ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ, రమాదేవి, కిరణ్, నాని పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



కోటవురట్లలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌనిక

కోటవురట్ల : ప్రస్తుత వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ మౌనిక సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. డాక్టర్ మౌనిక మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే డెంగ్యూ, మలేరియా, డయేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు ఏర్పాటులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు పరిశుభ్రమైన ఆహారం తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ పాల్గొన్నారు.

ఆదిరెడ్డిపాలెం పాల సొసైటీ అధ్యక్షుడిగా రమణ



పాల సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆదిరెడ్డి రమణను అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: ఆదిరెడ్డిపాలెంలోని విశాఖ డెయిరీ పాల సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఆదిరెడ్డి రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల సొసైటీలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా చిటికిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి కృష్ణ, కామిరెడ్డి లక్ష్మి, కొటాన రాము, ఆదిరెడ్డి పోతుబాబు, బైలపూడి దేముడు బాబు, కొటాన అప్పారావు, కొటాన కోటయ్య, తదితరులు ఎన్నికయ్యారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం వద్దు



వీఆర్వోలతో సమావేశమైన తహసీల్దార్

నక్కపల్లి : మండలంలో విద్యార్థులకు వివిధ వర్గాల వారికి జారీ చేసే ధ్రువపత్రాల విషయంలో జాప్యం వద్దని తహసీల్దార్ శ్రీకాంత్ ఆదేశించారు. గురువారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పునః ప్రారంభమైన నేపథ్యంలో కుల ఆదాయ, నివాస, ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను తక్షణమే విచారించి జారీకోసం సిఫార్సు చేయాలన్నారు. వీటితోపాటు రైతులకు అవసరమైన ధ్రువపత్రాలను కూడా జారీ చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వివిధ రకాల ఫిర్యాదులను తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు. మీ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్‌లో ఉంచడానికి వీల్లేదన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ, చైనులు, ఆర్ఐ కన్నబాబు పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

నది గట్టు పటిష్టం చేయాలని నిరసన



నదిలో దిగి నిరసన తెలుపుతున్న విశ్వనాథపురం గ్రామస్తులు

ఎస్.రాయవరం : వమ్మవరం శివారు విశ్వనాథపురం గ్రామంలో కోతకు గురయిన వరాహానది గట్టు పటిష్టం చేయాలని కోరుతూ గురువారం గ్రామస్తులు నదిలో దిగి నిరసన తెలిపారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ఈ నది గట్టు కోతకు గురికావడంతో వర్షాలు సమయంలో నది ప్రవాహం ప్రారంభం అయినప్పుడు బిక్కు బిక్కుమని జీవించాల్సి వస్తుందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నది గట్టు పటిష్టం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విశ్వనాథపురం గ్రామంతో పాటు పెనుగొల్లు శివారు సోమిదేవపల్లి గ్రామాల్లోనూ ఇదే సమస్య ఉందని వెంటనే అధికారులు స్పందించి ఈ సీజన్ ముందే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంగాలమ్మతల్లి గుడికి కేజీన్నర వెండి బహూకరణ



గంగాలమ్మతల్లి గుడికి కిలోన్నర వెండి బహూకరిస్తున్న సత్యవతి కుటుంబ సభ్యులు

మునగపాక : మూలపేటలో గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి పరిసర గ్రామాల భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం స్వర్గీయ కొయిలాడ అప్పారావు జ్ఞాపకార్థం భార్య సత్యవతి, కుటుంబ సభ్యులు అమ్మవారికి వడ్డాణం నిమిత్తం కేజీన్నర వెండిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు,పెద్దలు కాశీరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు



కోటవురట్లలో మెయిన్ రోడ్డు పరిస్థితి



తిమ్మాపురంలో చిత్తడిగా మారిన వీధి రోడ్డు

కోటవురట్ల: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. గ్రామీణ రహదారులు చిత్తడిగా మారి వాహనచోదకులను అవస్థలు పెడుతున్నాయి. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పల్లపు ప్రాంతాలు, రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోతోంది. అయితే ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. నారు పోసేందుకు వర్షం దోహదపడుతుందంటున్నారు. పలువురు రైతులు వరి నారు పోసేందుకు సిద్ధపడుతున్నారు.

ఎస్.రాయవరం : మండలంలో ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి పలు గ్రామాల్లో వీధి రోడ్లు చిత్తడిగా మారాయి. తిమ్మాపురంలో వీధి రోడ్లకు ఆనుకుని వ్యాపార సముదాయాలు, నివాసాలు అస్తవ్యస్తంగా నిర్మాణాలు చేపట్టడంతో తరచూ ఈ సమస్య తలెత్తుతోంది. ఓ మోస్తరు వర్షం కురిసినా వీధిరోడ్లపై నీరు పోయే మార్గం లేక సమస్య తలెత్తుతోంది. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని చెబుతున్నారు. ఇదే క్రమంలో పి.ధర్మవరం , పెనుగొల్లు, గోకులపాడు, పెదగుమ్ములూరు, రామయ్యపట్నం, పేటసూదిపురం, సర్వసిద్ధి, వెంకాపురం తదితర గ్రామాల్లో చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్లు ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచండి

హెచ్ఎంలకు ఉప విద్యాశాఖాధికారి అప్పారావు ఆదేశం



సమావేశంలో ఉప విద్యాశాఖాధికారి అప్పారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న హెచ్ఎంలు

రోలుగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల రోల్ పెంచాలని హెచ్ఎంలను డిప్యూటీ డీఈవో అప్పారావు ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఎంఈవో -1, 2 జానుప్రసాద్, జగ్గారావులను కలిసి మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల రోలు, వ్యత్యాసం గురించి ఆరా తీశారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ గురించి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు రోలు, ఉపాధ్యాయుల బోధన పరిస్థితులపై చర్చించారు. గ్రామాల్లో ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమాలు, ఉత్తమ బోధన, సాధిస్తున్న ఫలితాలు తదితర అంశాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో రోలును పెంచే బాధ్యత హెచ్ఎంలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలను ఎంఈవోలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

కేవీకే స్వర్ణోత్సవ వేడుకలు నేడు

రాంబిల్లి : హరిపురం బీసీటీ కేవీకేలో శుక్రవారం స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయన్నారు. 1974లో దేశంలోనే ప్రథమంగా పాండిచ్చేరిలో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఏర్పాటు చేసి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా కేవీకే స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారని శైలజ పేర్కొన్నారు.

చురుగ్గా వరి విత్తనాల పంపిణీ



బోడపాలెంలో వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ ఎరుకునాయుడు

కోటవురట్ల : మండలంలో వరి విత్తనాల పంపిణీ చురుగ్గా జరుగుతోంది. ఖరీఫ్ సీజనుకు గాను మండలానికి 765 క్వింటాళ్ల వరి విత్తనాలు రాగా కిలోకు రూ.10 రాయితీపై రైతులకు అందజేస్తున్నారు. గురువారం బోడపాలెం, చౌడువాడ, పాములవాక తదితర గ్రామాలలోని ఆర్బీకేలలో ఆయా సర్పంచుల చేతుల మీదుగా అందజేశారు. బోడపాలెంలో సర్పంచ్ శింగంపల్లి ఎరుకునాయుడు చేతుల మీదుగా రైతులకు విత్తనాలు అందజేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందని, రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాలని సర్పంచ్ కోరారు.

నేడు అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామి

మునగపాక: మునగపాక సంతబయిల అభయాంజనేయ స్వామి ఆలయ 26వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 నుంచి ఆలయంలో శాంతి హోమం అలాగే ప్రత్యేక అభిషేకాలు ఉంటాయన్నారు. తమలపాకులతో సహస్రనామార్చన వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభయాంజనేయ స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.